క్లుప్తంగా

స్థల ఆక్రమణపై ఆందోళన



నెల్లూరు రూరల్: నగరంలోని 32వ డివిజన్లో గల వెంగళరావునగర్ ఏ బ్లాక్‌లో కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలను చేపట్టాలని స్థానిక మహిళ యత్నించడంతో ఆందోళనను స్థానికులు గురువారం చేపట్టారు. దీనిపై కార్పొరేటర్ అవినాష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవికి సమాచారం అందించారు. ఆక్రమణలు జరుగకుండా చూడాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక మహిళ మామిడి సుబ్బమ్మ ఆక్రమణకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సచివాలయంలో ఫిర్యాదు చేశారు. పాలకీర్తి రాము, విజయ్‌కుమార్, చెంగల్రాయుడు, కిషన్, అశోక్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



నెల్లూరు రూరల్: బాలకార్మికుల గుర్తింపునకు గానూ స్పెషల్ డ్రైవ్‌ను దేవరపాళెం పంచాయతీ పరిధిలో గల ఇసనాకవారిపాళెంలో గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, బాలల సంరక్షణాధికారి సురేష్ ఆదేశాలతో కార్యక్రమాన్ని ఐసీపీఎస్ సిబ్బంది చేపట్టారు. 15 మంది వీధి బాలలు, బాలకార్మికులను గుర్తించారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తామని చెప్పారు. బాలకార్మికులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఐసీపీఎస్ సిబ్బంది పావని, సుమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రికి విరాళం



నెల్లూరు సిటీ: పొదలకూరు రోడ్డులోని కేన్సర్ హాస్పిటల్లో నూతన భవనానికి రూ.రెండు లక్షల విరాళాన్ని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ సుబ్బారెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో దీనికి సంబంధించిన చెక్కును రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో కేన్సర్ హాస్పిటల్ కన్వీనర్ జుబేర్‌కు గురువారం అందజేశారు. తన తల్లిదండ్రులు వెంకటరెడ్డి, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేశానని సుబ్బారెడ్డి తెలిపారు. వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్ కో కన్వీనర్ బలరామనాయుడు, కేన్సర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, సెక్రటరీ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



నెల్లూరు సిటీ: దాదాపు 500 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను నగరంలోని టీబీ కంట్రోల్ కార్యాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ మాట్లాడారు. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ద్వారా ఎంపిక చేసిన రోగులకు ఆర్నెల్ల పాటు కిట్లను ప్రతి నెలా అందజేయనున్నారని వివరించారు. దీనికి గానూ సీఎస్సార్ నిధుల కింద రూ.18 లక్షలను వెచ్చించారన్నారు.

సంతపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు



నెల్లూరు సిటీ: సంతపేటలోని పాత మున్సిపల్ కార్యాలయంలో గల నిరాశ్రయుల వసతి కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, అంగవైకల్యం ఉన్న వారికి ఉచిత న్యాయ సాయాన్ని అందిస్తున్నామని వివరించారు. ఏ అవసరమొచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించొచ్చని తెలిపారు. షెల్టర్ హోమ్ మేనేజర్ సుందరం పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కోవూరు: పేద, మధ్య తరగతి ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. పడుగుపాడులోని సచివాలయం – 3లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జెడ్పీటీసీ శ్రీలత, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, బొందిలి సంఘ రాష్ట్ర చైర్మన్ కిశోర్‌సింగ్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహమ్మద్, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ విడవలూరు మండలంలోని వరిణి, దండిగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, సర్పంచ్‌లు బెల్లంకొండ సుప్రజ, రాయల మల్లికార్జున, కాగొల్లు మస్తానయ్య, ఎంపీటీసీ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని కమ్మపాళెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అవ్వాతాతలకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అవసరమైన పలువుర్ని జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేశారు. వైద్య నిపుణులు నిఖిల్, ప్రశాంత్, కొడవలూరు పీహెచ్‌సీ వైద్యులు రామకృష్ణ, బాలచంద్రబాబు, యల్లాయపాళెం వైద్యాధికారి కావ్య, ఎంపీపీ జ్యోతి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీటీసీ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: కమ్మపాళెంలో కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న చలపతిరావు

పొదలకూరు: మండలంలోని బత్తులపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్ రిషిత, షెహ్లా, వెంకటశివకృష్ణ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

➡ మండలంలోని కనుపర్తి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని వైద్యాధికారి కిరణ్ రిషిత తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముత్తుకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పిడతాపోలూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పరిశీలించారు.



విడవలూరులో..

దాదాపు 322 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సర్పంచ్ రాజకుమారి, వైద్య నిపుణులు వినీల, కృష్ణచైతన్య, చక్రవర్తి, చందనప్రియ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని చెరుకుమూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఎంపీపీ గుండాల వజ్రమ్మ హాజరయ్యారు. దాదాపు 315 మందికి వైద్యసేవలను అందించారు. వైద్యులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, గేయ పూజిత, ఆమని, గుండాల శిరీష, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: బత్తులపల్లిలో..



ముత్తుకూరు: పిడతాపోలూరులో..



మనుబోలు: చెరుకుమూడిలో..

నిలకడగా నిమ్మ ధరలు

పొదలకూరు: నిమ్మ ధరలు నిలకడగా ఉన్నాయి. విజయదశమికి ముందు కాయల ధరలు నిలకడగా ఉండటం రైతులకు కొంతవరకు ఉపశమనంగా మారింది. ప్రస్తుతం కిలో నిమ్మకాయల ధర రూ.30 నుంచి రూ.65 వరకు పలుకుతోంది. ఈ లెక్కన బస్తా కాయలు రూ.2400 నుంచి రూ.ఐదు వేల వరకు ఉంది. దసరా సందర్భంగా కాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు వెల్లడించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటకకు కాయల ఎగుమతులు పెరిగాయి. ఈ రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశంలో సైతం నవరాత్రులను వైభవంగా నిర్వహించనున్న తరుణంలో కాయలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు తోటల్లో కాయల దిగుబడి గణనీయంగా తగ్గింది. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో తోటల్లో బోర్లపై రైతులు ఆధారపడి నీటిని పెట్టుకుంటున్నారు.



నిమ్మ మార్కెట్‌కు వచ్చిన కాయలు

ఎన్‌సీసీ క్యాడెట్లుగా 35 మంది ఎంపిక



నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ నావల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎంపికలను గురువారం నిర్వహించారు. రాత, ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించి 35 మంది విద్యార్థులను ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ గిరి, పీఏ స్టాఫ్ శివప్రసాద్, సునీల్, నావల్ యూనిట్ కేర్ టేకర్ దివ్య, పీఆర్వో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 34వ డివిజన్లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. శిబిరానికి హాజరైన ప్రజలను పలకరించి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోగులకు అంకితభావంతో సేవలను అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిషనర్ వికాస్ మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ ఫమీదా, నేతలు రియాజ్, కంతర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



కోవూరు: విజయభానురెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్న



కొడవలూరులో..

కోవూరు: బైపాస్ సర్జరీని ఇటీవల చేయించుకున్న విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆరోగ్య విషయాలను ఆరాతీశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ కొడవలూరు మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: మండలంలోని మానేగుంటపాడు సర్పంచ్ పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో మానేగుంటపాడులో శ్రీనివాసులురెడ్డి సతీమణి సుదర్శనమ్మను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు.

యల్లాయపాళెం పీహెచ్‌సీకి ఏసీ వితరణ

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీకి ఏసీని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమకూర్చారు. యల్లాయపాళెంలో ఇటీవల పర్యటించిన ఎమ్మెల్యేకు ఏసీ విషయాన్ని పీహెచ్‌సీ వైద్యులు తెలియజేశారు. ఈ క్రమంలో ట్రస్ట్ ద్వారా ఏసీని అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఏసీని యల్లాయపాళేనికి పంపగా, వైద్యశాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అమరావతి, నేతలు తాటిపర్తి భాస్కర్, పెంచలయ్య, మాబాషా, పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్య, హెచ్ఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



మనుబోలు: సమాజానికి ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులని పాఠశాల కమిటీ కో ఆప్షన్ సభ్యుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డేవిడ్‌ను గురువారం సత్కరించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఆయన బాటలు వేస్తున్నారని కొనియాడారు.

సాయినాథుడికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు అన్నదానాన్ని నిర్వహించారు. మందిరంలో భక్తుల భజనలు, స్వామివారి పల్లకిసేవను జరిపారు.

ఉప ఖజానా కార్యాలయంలో ట్రైయినీ కలెక్టర్



కోవూరు: స్థానిక ఉప ఖజానా కార్యాలయానికి ట్రైయినీ కలెక్టర్ సంజనా సిన్హా గురువారం విచ్చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు విషయాలను ఆరాతీశారు.

కాకుటూరు, కురిచెర్లపాడులో మంత్రి పర్యటన నేడు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు, కురిచెర్లపాడు గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకుటూరులో ఉదయం పది గంటలకు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొననున్నారని చెప్పారు. అనంతరం 11 గంటలకు కురిచెర్లపాడు చేరుకొని గ్రామ సచివాలయ భవనం, సీసీ రోడ్లు, సైడ్ కాలువలను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

వెంకటాచలం: వెంకటాచలం మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ వెంకటరమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించనున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బద్దెవోలులో ఆందోళన

మనుబోలు: మద్యం దుకాణం వద్దంటూ మహిళలు ఆందోళన చేపట్టిన ఘటన మండలంలోని బద్దెవోలులో గురువారం చోటు చేసుకుంది. అధికారులు స్పందించి ఇక్కడ ఉన్న మద్యం షాపును దూరంగా తరలించాలని కోరారు.

మోసగించి వివాహం చేసుకున్నారని ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): మోసగించి పెళ్లి చేసుకున్న భర్తతో పాటు అత్తింటి వారిపై చర్యలు చేపట్టాలంటూ వేదాయపాళెం పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేశారు. వివరాలు.. నేతాజీనగర్‌కు చెందిన ఓ యువతికి టైలర్స్ కాలనీ శివాజీనగర్‌కు చెందిన ఓ యువకుడితో ఈ ఏడాది మేలో వివాహమైంది. ఆ సమయంలో యువతి కుటుంబసభ్యులు రూ 8 లక్షల నగదు, 14 సవర్ల బంగారును కట్న కానుకల కింద ఇచ్చారు. వివాహమైన రోజు నుంచే యువకుడు భార్యను దూరం పెడుతూ వచ్చారు. ఇదేమని భార్య నిలదీయగా, తాను సంసారానికి పనికిరానని, ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపుతానని బెదిరించారు. ఈ విషయాన్ని బాధితురాలు తన అత్తామామల దృష్టికి తీసుకెళ్లగా, వారు సైతం ఇదే విషయాన్ని వెల్లడించారు. దీంతో చేసేది లేక బాధిత యువతి తనను మోసగించి వివాహం చేసుకున్న భర్త, అత్తింటివారిపై చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘన సన్మానం



నెల్లూరు(బారకాసు): నుడాలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం స్వచ్ఛంద విరమణ చేశారు. ఈ క్రమంలో నుడా కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను వైస్ చైర్మన్ బాపిరెడ్డి, సిబ్బంది సత్కరించారు.

ఎంపీ ఆదాలకు సత్కారం



నెల్లూరు(పొగతోట): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ నేతలు గురువారం సత్కరించారు. నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సేవాసమితి జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడారు. నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ సీఎం ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల రామలింగాపురం ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని హరనాథపురం సెక్షన్ ఏఈ దామోదర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగాపురం, ముత్యాలపాళెం, మినీబైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి 11.15 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• నవలాకులతోటలోని 132 కేవీ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా కోడూరుపాడులో ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని నారాయణరెడ్డిపేట ఏఈ శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

పీడీఎస్‌యూ మహాసభల లోగో ఆవిష్కరణ



నెల్లూరు(టౌన్): పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నగరంలోని వీఆర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఆహ్వాన సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను నగరంలో డిసెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నామని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు సునీల్, సాహెబ్, జిల్లా కమిటీ సభ్యుడు నసీర్, చరణ్, వినయ్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



నెల్లూరు(దర్గామిట్ట): మర్రిపాడు మండలం నందవరానికి చెందిన పలువురు క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం అందజేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటిస్తున్న సమయంలో, తమకు క్రికెట్ కిట్లు కావాలని యువత కోరారు. ఈ క్రమంలో ఆయన అందజేశారు. క్రికెట్ ప్రపంచ కప్‌లో భారత్ జట్టు విజేతగా నిలవాలని కాంక్షించారు.

రవాణా శాఖలో సేవలపై ఆరా



నెల్లూరు(టౌన్): నగరంలోని రవాణా శాఖ కార్యాలయాన్ని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు సునీల్ చక్రవర్తి గురువారం సందర్శించారు. రవాణా శాఖలో అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. డీటీసీ చందర్, ఆర్టీఓ సిరి తదితరులు పాల్గొన్నారు.